# నూతనాంధ్రరాష్ట్రంలో సినిమా పరిశ్రమ

కొడవటిగంటి కుటుంబరావు

ఆంధ్రరాష్ట్రావతరణతో సినిమా పరిశ్రమలో తప్పనిసరిగా ఏవో మార్పులు వస్తాయనీ; మద్రాసు నగరంలో తెలుగువారి స్టూడియోలకూ, తెలుగుచిత్రాల నిర్మాణానికీ స్థానం ఉండదనీ; 'ఎవరో' తెలుగుచిత్ర నిర్మాతలనూ, తెలుగు నటీనటులనూ ఆంధ్రదేశానికి తరిమివేస్తారనీ జన సామాన్యంలో అపోహలున్నట్టు కనిపిస్తుంది. ఈ విధమైన అపోహలకు ఎటువంటిఆస్కారమూ లేదు.

తెలుగుసినిమా పరిశ్రమనుగురించి ప్రప్రథమంగా తెలుసుకోవలసిన విషయమేమంటే ఇది తెలుగు గడ్డమీద ఏనాడూ వేరుతన్నలేదు. 1935-38 మధ్యకాలంలో రాజమండ్రి, విశాఖపట్నాలలో స్టూడియోల నిర్మాణం జరిగింది. రాజమండ్రీలోని దుర్గా సినీటోన్‌లో "సంపూర్ణ రామాయణం" తయారైన పిమ్మట అది సి. పుల్లయ్యగారి కిందికి వచ్చి ఆంధ్రా టాకీస్ అయింది. అక్కడ సి. పుల్లయ్యగారు "సత్యనారాయణ వ్రతం" అన్న చిత్రంతోబాటు "చల్ మోహనరంగ," "కాసుల పేరు" అనే హ్రస్వ చిత్రాలూ, మరుసటి సంవత్సరం "మోహినీ భస్మాసుర" తయారు చేశారు. అనంతరం ఆ స్టూడియో మూతపడింది. విశాఖపట్నంలో ఆంధ్రసినీటోన్ స్టూడియోలో "జయదేవ" తయారయింది. టెక్నికల్‌గా ఈ చిత్రం బాగా ఉన్నదని కూడా అనిపించింది. అయితే ఈ స్టూడియోలోనే తీసిన "పాశుపతాస్త్రం" అన్న మరో చిత్రాన్ని ఇతర స్టూడియోలకు తీసుకుపోయి మరమ్మతు చేయవలసి వచ్చింది. ఆ తటితో తెలుగు గడ్డమీద తెలుగుచిత్రాల నిర్మాణం ముగిసింది.

ఎక్కడెక్కడి నదులూ సముద్రం చేరినట్టు, అదివరకల్లా కలకత్తా, బొంబాయి, కొల్హాపూర్, పూనా నగరాలలో తయారవుతూండిన తెలుగు చిత్రాలు, తెలుగుగడ్డమీది స్టూడియోలు మూలబడే కాలంనాటికి, మద్రాసు చేరుతున్నాయి. 1938 తరువాత తయారైన తెలుగు చిత్రాలలో చాలా హెచ్చు సంఖ్య మద్రాసులో తయారవుతూ వచ్చినవే. తెలుగు గడ్డమీద స్టూడియో నిర్మాణానికి మళ్ళీ జరగకపోవటానికి కారణం కూడా తెలుగుచిత్రాల నిర్మాణం మద్రాసువంటి నగరంలో పాతుకుపోవడమే. 1939లో యుద్ధం ఆరంభమయేనాటికల్లా తెలుగుచిత్రాలలో నటించే ప్రముఖ స్త్రీ పురుష తారలూ, చిల్లరనటులూ కూడా మద్రాసులో స్థిరనివాసాలేర్పాటు చేసుకున్నారు. అంతకుపూర్వం చిత్రనిర్మాతలు చిత్రనిర్మాణం తలపెట్టినప్పుడల్లా బెజవాడ, తెనాలి గుడివాడ, బందరు, రాజమండ్రి, విశాఖపట్నం విజయనగరం వగైరా గ్రామాలు పర్యటించి ఆర్టిస్టులను వెతుక్కునేవారు. అటువంటి నటులు ఆఫీసుకు వచ్చి ఎగ్రిమెంట్లమీద సంతకాలుపెట్టే పరిస్థితి ఏర్పడింది.

తెలుగు చిత్రాల నిర్మాణం ఆంధ్రలోకాక మద్రాసులో పాతుకుపోవటంవల్ల నష్టాలు కలగలేదనికాదు. సినిమాకు పనికివచ్చేవారికోసం నిర్మాతలు వెతికే అవసరం తప్పిందన్నమాటేగాని, ఇందువల్ల పనికివచ్చేవారికి సినిమా అందుబాటులో లేకుండా పోయింది. పాడగలశక్తో, అందచందాలో ఉన్నవారు మద్రాసునగరానికివచ్చి పడిగాపులు పడితేనే ఏదైనా అవకాశం, లేకపోతే లేదు. దీనితోబాటు, సినిమా నటులుగా అదివరకే చలామణీ అవుతున్నవారికొరకు పోటీలుపడటం జాస్తిఅయి, సినిమాతారల వేతనాలు హెచ్చిపోసాగాయి.

మరొకనష్టం ఏం జరిగిందంటే, "రైతుబిడ్డ" తీసేసమయంలో రామబ్రహ్మంగారు అనుభవం ద్వారా తెలుసుకున్నట్టు, చిత్రాలలో వాస్తవమైన తెలుగువాతావరణం సృష్టించాలంటే ప్రతి చిన్నవస్తువుసంపాదించటానికీ చెప్పరానియాతనైపోయింది మద్రాసు పరిసరాలలో పొలాలువేరు, బళ్లువేరు, ఎద్దులువేరు, వాటి మెడపట్టెళ్ళువేరు, చరణాకోలలువేరు, నాగళ్లువేరు—అన్నీ వేరే.

ఇవి నష్టాలే అయినా ఇంతకుమించిన లాభాలు కూడా కలిగాయి. (లేనిపక్షంలో తెలుగుపరిశ్రమ ఇంతకాలం మద్రాసులో నిలబడి ఉండేదే కాదు.) తెలుగు చిత్రనిర్మాణం మద్రాసులో స్థిరపడి పోవటంవల్ల ఈ కిందిలాభాలు కలిగాయి:

1. ఒక్కొక్క నిర్మాత ఒక్కొక్క స్టూడియోకూ, దానికిచెందిన పనివారికీ అలవాటు పడిపోయే అవకాశం లభించింది. అదివరకు చిత్రనిర్మాణం సత్రపు మకాం. దేశంకాని దేశానికి ట్రూపును వేసుకు పోవడం, అక్కడి స్టూడియోవారిచ్చే సౌకర్యాలను దయాధర్మబిచ్చంగా స్వీకరించటమూ జరిగేది. చిత్రం పూర్తికాగానే చేతులు కడిగేసుకుని వచ్చేవారు. ఆ స్టూడియోవారు తమ మొదటి చిత్రానికి సహకరిస్తే అది అంత మంచి స్టూడియో కాకపోయినా రెండోసారి మళ్ళీ అక్కడికే వెళ్ళేవారు. స్టూడియోవారి సహకారంలభించకపోతే రెండోసారి ఇంకో కొత్తచోటికీ, ఇంకో కొత్త పరిసరాలకు వెళ్ళి మళ్ళీ కొత్త అనుభవంసంపాదించుకునేవారు. పరిస్థితులు ఇంత అయోమయంగా ఉండటంవల్లనే 1937 దాకా తయారైన తెలుగు చిత్రాలలో ఎక్కువభాగం ఆంధ్రేతరులు కంట్రాక్టర్ల సహాయంతో తీసినవి.

మద్రాసులో తెలుగు చిత్రనిర్మాణం సాగుతున్నాక ఈ అవస్థ తప్పింది, పదివేలో, ఇరవైవేలో, అరలక్షో పట్టుకుని ఎవరుపడితే వారు మద్రాసుకు వచ్చి తమకు కావలసిన స్టూడియో మాట్లాడుకుని, తమకు నచ్చిన "కవి"ని, డైరక్టరునూ, తారలనూ, చిల్లర నటులనూ బుక్ చేసి చిత్రం తీసే అవకాశం ఏర్పడింది.

2. చిత్ర నిర్మాతలూ, డైరెక్టర్లూ కాలేజీలలో తయారుకారు. వారు పరిశ్రమలలోనుంచి రావలసిందే. పరిశ్రమే వారికాలేజీ. మద్రాసులో తెలుగు పరిశ్రమ స్థిరపడకపూర్వం తయారైన చిత్రాలకు నిర్మాతలూ, డైరెక్టర్లూ ఇతర ప్రాంతీయులుగా ఉండేవారు. కాని ఈ పరిస్థితి మారిపోయింది. మద్రాసు వాతావరణంలో రకరకాల అనుభవాలు సంపాదించినవారు చిత్రనిర్మాతలుగానూ, డైరెక్టర్లుగానూ ముందుకు వచ్చి తమశక్తిసామర్థ్యాలు త్వరలో రుజువు చేసుకున్నారు.

తెలుగు చిత్రనిర్మాతలు ఏర్పడటంతోబాటు తెలుగు డిస్ట్రిబ్యూటర్లు కూడా బయలుదేరారు.

3. తెలుగుచిత్రాల నిర్మాణం మద్రాసులో స్థావరం ఏర్పరచుకునేదాకా తెలుగు టెక్నీషియనులు తయారయే అవకాశాలు లేకపోయాయి. ఎక్కడెన్నా ఒకరూ, అరా బొంబాయి స్టూడియోలలో అవకాశం సంపాదించినా వారు త్వరలోనే అభివృద్ధిలోకి వచ్చి బాధ్యతవహించే దారి లేకపోయింది. కాని మద్రాసు స్టూడియోలలో తెలుగు చిత్రాల నిర్మాణం అభివృద్ధి చెందినకొద్దీ తెలుగువారు వివిధ శాఖలలో అనుభవమూ, శిక్షణా పొందే అవకాశంకూడా చిక్కింది.

4. యుద్ధానంతరకాలంలో మరికొన్ని కొత్త లాభాలుకూడా కలిగాయి. తమిళచిత్ర పరిశ్రమా, తెలుగుచిత్ర పరిశ్రమా దాదాపు ఏకకుటుంబంగా ఉంటూరావటంచేత ఈ రెండు పరిశ్రమలూ సమ్మేళనంకావటానికి వీలుకలిగింది. యుద్ధానికి పూర్వం తెలుగునిర్మాతలు తెలుగు చిత్రాలూ, తమిళనిర్మాతలు తమిళచిత్రాలూ తీశారు. తెలుగు తారలు తెలుగుచిత్రాలలో నటిస్తే తమిళతారలు తమిళచిత్రాలలో నటించారు. కాని యుద్ధానంతరం తెలుగుచిత్రాలను జెమినీ, ఏ. వి. ఎం., మోడరన్ థియేటర్స్, కృష్ణాపిక్చర్స్, జూపిటర్స్, పక్షిరాజా వగైరా తమిళసంస్థలుకూడా తయారుచేశాయి. విజయ, భరణి, రోహిణీ, ప్రకాశ్ మొదలైన తెలుగుసంస్థలు తమిళచిత్రాలుతీశాయి. కన్నాంబ, పుష్పవల్లి, భానుమతి, అంజలి, నాగయ్య, నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు మొదలైన తెలుగునటులు తమిళ చిత్రాలలోను టి. ఆర్. రాజకుమారి, మాధురిదేవి, వైజయంతిమాల, టి. ఆర్. రామచంద్రన్, బాలయ్య, గణేశన్ మొదలైన ఆంధ్రేతర నటులు తెలుగు చిత్రాలలోను నటించటం జరిగింది. ఈకలకలుపువల్ల ఉత్తమ తెలుగు, తమిళచిత్రాలకు దక్షిణదేశమంతటా ప్రచారం లభించింది. చిత్రనిర్మాణవ్యయం బాగా పెరిగిపోయిన యుద్ధానంతరకాలంలో ఈపరిణామమే లేకపోతే చిత్రనిర్మాణం బాగా దెబ్బతినిఉండును. తెలుగుపరిశ్రమ తమిళపరిశ్రమతోబాటు మద్రాసులో కేంద్రీకృతం కావటమే ఈపరిణామానికి వీలుకలిగించింది.

2-10-53

ఆంధ్రరాష్ట్రం అవతరించడంవల్ల ఈ సౌకర్యాలన్నీ తుడిచిపెట్టుకుపోవు. సినీమాపరిశ్రమ యొక్క కేంద్రీకరణ రాష్ట్ర సరిహద్దులను పాటించదు. హిందీచిత్రనిర్మాణం కలకత్తా, బొంబాయి నగరాలలో ఒకేసమయంలో ప్రారంభమయినప్పటికీకూడా హిందీ చిత్ర పరిశ్రమ కాలక్రమాన బొంబాయిలో కేంద్రీకృతమైపోయింది. ఈవిషయం గుర్తించి అనేకమంది ప్రముఖ సినిమా కారులు నితిన్ బోస్, సైగల్, సన్యాల్, బిమల్‌రాయ్, బొరాల్, జగదీశ్ సెఠీ, లీలాదేశాయ్ మొదలైన వారు—కలకత్తానుంచి బొంబాయి చేరుకుని, ఇందులో కొందరు అక్కడే స్థిరావాసం ఏర్పరుచుకున్నారు కూడా.

ఆంధ్రరాష్ట్రం వచ్చినాక రాష్ట్రాభిమానం కొద్దీ తెలుగుసినిమా పరిశ్రమ మద్రాసు విడిచిపోవలసిన అవసరం ఆవగింజలో అరభాగమైనా లేదు. ఆంధ్రరాష్ట్రం వచ్చినా కూడా ఆంధ్రేతరులు తీసే చిత్రాలలో తెలుగు నటులు నటిస్తారు. తెలుగు రచయితలు రచనలు చేస్తారు. చిత్రాలు బాగుంటే తెలుగుప్రజలు చూస్తారు. ఈనాడైనా కలకత్తాలో తయారైన తెలుగు చిత్రం, బాగుండాలేగాని, ఆంధ్రదేశమంతటా నిరాక్షేపణగా ఆదరం పొందుతుంది. కనుక రాష్ట్రాభిమాన సమస్య ఏమీలేదు.

చిత్రనిర్మాణం ఆంధ్రకు మారితే అందువల్ల ఆంధ్రకు కలిగే ఆర్థిక లాభం కూడా అనుమానాస్పదమే. చిత్రనిర్మాణానికయ్యే ఖర్చులో కొద్దిభాగం స్థానిక వ్యయం ఉండేమాట నిజమేగాని, మద్రాసులో పరిశ్రమ ఉండటంవల్ల అంతకంటె హెచ్చులాభం ఉంది. ఏమంటే మన తారలు తమిళ చిత్రాలద్వారా తమిళుల సొమ్ము సంపాదిస్తారు. ఈ కారణంచేత ఆర్థికసమస్యను కూడా అంతగా పాటించనవసరం లేదు. సినిమా పారిశ్రామికులు చెల్లించే పన్నులు వగైరా లున్నా

(ESTD: 1907)



దక్షిణ ఇండియాలో ముఖ్యమైన చోట్లన్నిటిలోను బొంబాయిలోను బ్రాంచీలు కలవు.

| | | |
|---|---|---|
| చందా వేసిన మూలధనము | ... | రు. 72,00,000 |
| చెల్లించిన మూలధనము | ... | రు. 55,40,000 |
| రిజర్వుఫండ్, తదితరఫండులు | ... | రు. 73,50,000 |

అన్ని విధములయిన బ్యాంకింగ్ వ్యాపారములు చేయబడును.

ఎన్. గోపాల అయ్యర్, సెక్రెటరీ.

ఇండియన్ బ్యాంక్ లిమి.,
హెడ్డాఫీసు : మదరాసు

N.P.B

యంటే అవి చాలావరకు కేంద్రం వసూలు చేసేవే. వినోదపు పన్నువంటివి రాష్ట్రపు పన్నులైనా అవి చిత్రం నడిచేచోట వసూలవుతాయిగాని, చిత్రం తయారయేచోట కాదు.

అయినప్పటికీ తెలుగుచిత్రపరిశ్రమ తెలుగుగడ్డ మీదికి వెళ్ళిపోవలసిన కారణం ఉన్నది. దానికి రాష్ట్రావతరణతో సంబంధం లేదు. ఇది చిత్ర నిర్మాణంయొక్క ఆంతరంగికసమస్య.

కొద్దికాలంగా మనచిత్రపరిశ్రమ తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటున్నది. మనదేశంలో టాకీచిత్రనిర్మాణం ఆరంభమైననాటినుండీకూడా మననిర్మాతలు హాలీవుడ్ సంప్రదాయాలను అనుసరించారు. మనహిందీచిత్రాలలో ప్రవేశపెట్టిన ఆకర్షణలూ, శిల్పమూ, ఇతివృత్తాలూ, తారలకిచ్చిన ప్రాముఖ్యమూ, వ్యాపారపద్ధతులూ కూడా ప్రపంచమార్కెటుగల హాలీవుడ్ చిత్రాలనుంచి అరువుతెచ్చుకున్నవి. అయితే హిందీచిత్రాలకు యావద్భారతంమీద చలామణీ ఉందిగనక ఈ పద్ధతులు కొంతకాలం విజయవంతంగా సాగాయి. హాలీవుడ్‌నుచూసి హిందీ చిత్రనిర్మాతలు ఏయే పద్ధతులైతే నేర్చి అలవరచుకున్నారో, మన దక్షిణదేశ నిర్మాతలుకూడా అవేపద్ధతులను నేర్చుకున్నారు. కాగా, మనచిత్రాలకు యావద్భారత చలామణీలేదు.

ఈనాటి పరిస్థితి చూస్తే హాలీవుడ్ చిత్రాలు చిక్కుల్లోఉన్నాయి, హిందీచిత్రాలూ చిక్కుల్లోనేఉన్నాయి, మనచిత్రాలూ చిక్కుల్లోనే ఉన్నాయి. ఇకనైనా మన నిర్మాతలు జరిగిన పొరపాటు ఎటువంటిదో తెలుసుకుని కళ్లుతెరవాలి. మనకున్న మార్కెటులో శిల్ప ప్రతిభకూ, తారల ఆకర్షణతో వ్యాపారంచెయ్యటానికి ఆస్కారంలేదు. ఆస్కారం ఉన్నచోటనే ఈ ఆకర్షణలమూలంగా మన సినిమాకళ జాతీయవికాసాన్ని కోల్పోయింది. కళకు సహజమైన సామాజిక ప్రయోజనం మంటగలిసింది. చిత్రాల ఖరీదు అసహజంగా పెరిగిపోయింది. ఒక్కచిత్రం కూడా ఇటీవల తృప్తికరంగా నడిచినట్టు కనబడటంలేదు.

హిందీ బెంగాలీ చిత్రాలు ఈ దుస్థితినుంచి తప్పుకుని జాతీయతనూ, కళాప్రయోజనాన్ని పాటించేధోరణిలో ఖరీదైనా ఆకర్షణలనువిసర్జించి చవుకగా తయారవుతున్నాయి. ఉత్తమ సాహిత్యంతో తులతూగగల చిత్రాలను అక్కడివారు తయారుచేస్తున్నారు.

అటువంటి చిత్రాలను తెలుగులోకూడా ఒకటిరెండు లక్షలరూపాయిలలో తీయవచ్చు. అయితే ఆ చిత్రాలు తీయటానికి మద్రాసు సరి అయినస్థానంకాదు. మద్రాసులో తీసేచిత్రాలలో తెలుగు వాతావరణం చూపటం సాధ్యంకాదు. "పల్నాటియుద్ధం"లో పల్నాటి వాతావరణం ఏకోశానాలేదు. మన సాంఘికచిత్రాలలో తెలుగుదేశపు వాతావరణం ఉండటంలేదు. మద్రాసులో తయారయే చిత్రాలకుకూడా ఆంధ్రేతరులు కళాదర్శకులుగా పనిచేయటం జరుగుతున్నది. ఆఖరుకు తెలుగురైతులనూ, తెలుగు మధ్యతరగతివాళ్ళనూ, వారివారిఇళ్ళనూ కూడా మనచిత్రాలు చూపలేకుండా ఉన్నాయి. మన తెలుగు చిత్రాలలో గుడిసెలని చూపించే వాటిల్లో దాదాపు ఒక్కటికూడా వాస్తవమైన గుడిసెకాదని ఒక తెలుగు కళాదర్శకుడే అన్నాడు.

తెలుగుదేశంనిండా సినిమాకు పనికివచ్చే నటనటులున్నారు. కాని, మద్రాసులోని తెలుగు చిత్రపరిశ్రమలోకి వాళ్లు రాలేరు. ఏ బెజవాడలోనో, రాజమండ్రిలోనో, విశాఖపట్నంలోనో స్టూడియోలుకట్టి తెలుగుచిత్రాలు నిర్మిస్తే వారు బయటికివస్తారు. చవుకగా చిత్రాలలో నటిస్తారు. చిత్రానికి అసలైన తెలుగుతనం అందిస్తారు. చిత్రాలు చౌకగానూ, త్వరగానూకూడా అయిపోతాయి. తారల ఆకర్షణకు స్వస్తిచెప్పినాక కథలో బలం విధిగా చూసుకోవలసివస్తుంది.

ఈ మార్పులు వచ్చితీరవలసినవన్న విషయం క్రమక్రమంగా గుర్తించబడుతోంది. అయితే ఇది సాధ్యంకావాలంటే తెలుగుసినిమా పరిశ్రమ మద్రాసుకూడా విడిచిపెట్టి ఆంధ్రకు తరలిపోవాలి. ఆంధ్రరాష్ట్రం అవతరించే ఈ సుముహూర్తాన తెలుగు చిత్రపరిశ్రమ నెదుర్కొంటున్న అసలు సమస్య ఇదే—మద్రాసునుంచి ఆంధ్రకు తరలిపోవటం.